సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులో 4 అర్జీలు



తహసీల్దార్ శ్రీవల్లికి అర్జీ అందజేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు షీలా నగర్ లైబ్రరీ వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి వినతులు స్వీకరించారు. హరిజనజగ్గయ్యపాలెం నాయకులు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. మొత్తం నాలుగు వినతులు అందినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్, నాయకులు అలమండ రాజు, శ్రీను, జీవన్‌బాబు, గోపాలరాజు, నిర్మలా కుమారి, భాస్కర్, కరణం ముత్యాల నాయుడు, గుమ్మిడి ఆంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీప పాశురం



దీప పాశురం చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 19వ పాశుర విన్నపం సందర్భంగా దీప పాశురం చేపట్టారు. ముందుగా ఆలయ అర్చకులు తిరుప్పావై చదివి హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాయి నాయుడు, నరసింగరావు మాస్టార్, సత్యనారాయణ, కృష్ణారావు, గురునాథ్, సోమశేఖర్, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, మోహిని, నాగలక్ష్మి, గొల్లవిల్లి వెంకటరావు పాల్గొన్నారు.

సదస్సులతో విద్యా ప్రమాణాల మెరుగు



డీన్ భాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు సదస్సులు దోహదపడతాయని మధురైకు చెందిన త్యాగరాజన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ భాస్కర్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు ఆధునిక పాఠశాల పద్ధతులు, ఔట్ కమ్ బెస్ట్ ఎడ్యుకేషన్ సదస్సును ఆయన ప్రారంభించారు. రుబ్రిక్స్ డిజైన్ అభ్యసనపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, డీన్‌లు హరి గోవిందరావు, సుందర్‌రామన్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు!



అక్కిరెడ్డిపాలెం వెంకటేశ్వరస్కూల్ లైన్‌లో విద్యుత్ తీగలను తాకుతున్న చెట్లు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని వెంకటేశ్వర స్కూల్ రోడ్డులోని కరెంట్ తీగలకు చెట్లు తాకడంతో ప్రమాదం పొంచి ఉంది. వర్షాలు పడినప్పుడు షాక్ కొట్టే ప్రమాదం ఉందని పలువురు భయాందోళనకు గురవుతున్నారు. స్కూల్‌కు వచ్చే చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వైర్లకు తాకుతున్న కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

కళ తప్పిన సచివాలయం!

సేవలను తగ్గిస్తున్న కూటమి ప్రభుత్వం

- పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ప్రజల ప్రదక్షిణ
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్లు
- గత ప్రభుత్వంలో 545 సేవలు



కళతప్పిన దళ్లివానిపాలెం సచివాలయం



బోసిపోయిన సచివాలయం లోపల భాగం

పెదగంట్యాడ: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చింది. ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. ప్రజలు ఇంటి వద్దే అన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకుంది.

నేడు సీన్ రివర్స్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సచివాలయాల సేవలకు తూట్లు పొడుస్తోంది. సేవలకు కోత విధిస్తోంది. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడునెలలు కావస్తున్నా పథకాలు అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

గత ప్రభుత్వంలో సేవలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాలకు అనుసంధానంగా 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించి వారికి ఎలాంటి సేవలు కావాలన్నా ఇంటివద్దే అందించేవారు.ఇందులో భాగంగా గాజువాక నియోజకవర్గ పరిధిలో 107 సచివాలయాలు ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించింది. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ,.పోలీస్, విద్యుత్ తదితర సేవలతో పాటు వివిధ ధ్రువ పత్రాల కోసం ప్రజలు తిరిగే పనిలేకుండా ఉన్న చోటే అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సేవలకు తూట్లు పడ్డాయి. సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టింది. దీంతో సచివాలయాల సేవలను గత ప్రభుత్వంలాగా కొనసాగించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ల కోసం ఎదురు చూపులు

ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయలేదు. దీంతో వారు సచివాలయాల చుట్టూ తిరగడం.. ఇంకా సైట్ ఓపెన్ కాలేదని సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. తాము అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్ పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు సచివాలయ ఉద్యోగులపై అనేక అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాకా పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కు అయ్యారు.

రేషన్.. ఆరోగ్యశ్రీ కార్డుల కోసం..

ఇప్పటి వరకూ ఒక్క రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో అలాంటి సేవలు ఏమీ లేవని సిబ్బంది చెబుతున్నారు.సర్వేల పేరుతే సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్నారు.

నిర్వహణ లోపమే ప్రమాదానికి కారణం

సీఐటీయూ నాయకుల ఆరోపణ



సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: సింటర్ ప్లాంట్ ప్రమాదానికి నిర్వహణ లోపమే కారణమని స్టీల్ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరు, కారణాలపై అక్కడి కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత యాజమాన్యం ప్లాంట్ మెయింటెనెన్స్‌పై శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈ ప్రమాదం వల్ల బ్లాస్ట్‌ఫర్నేస్ ఉత్పత్తికి అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, కె.వి. సత్యనారాయణ, టి.వి.కె. రాజు, బి. మహేష్, ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

యాజమాన్యం బాధ్యత వహించాలి

పొదుపు చర్యల పేరిట సిబ్బందిని తగ్గించడం వల్ల కన్వేయర్‌లో స్పిల్లేజి తొలగించక పోవడంతో గ్యాలరీ బరువు పెరిగి కూలి పోయిందని సిటూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి. శ్రీనివాసరావు, నమ్మి రమణ అన్నారు. ప్రమాదానికి యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు.

హయ్యర్ పెన్షన్ ఉత్తర్వుల జారీకి సహకరించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హయ్యర్ పెన్షన్ ఉత్తర్వులు విడుదల చేసేలా సహకరించాలని స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన హయ్యర్ పెన్షన్ ఆశావహుల బృందం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. విశాఖ పీఎఫ్ కార్యాలయం 2500 మందికి హయ్యర్ పెన్షన్ కోసం డిమాండ్ నోటీసులు పంపిందన్నారు. నోటీసులకు స్పందించిన ఉద్యోగులు రూ. 410 కోట్లు పీఎఫ్ కార్యాలయానికి చెల్లింపులు చేశారన్నారు. రెండు, మూడు నెలల్లో పెన్షన్ మంజూరు చేయాల్సి ఉన్నా ఇంత వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ద్వారా కార్మిక మంత్రి మనసుఖ్ మాండవీయతో మాట్లాడించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా స్పందించి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఫోన్‌లో విషయం చెప్పగా రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారని పెన్షనర్లు తెలిపారు. కార్యక్రమంలో వాసా మూర్తి, జె.ఎ. స్వామి, పి. రామ్మోహన్‌రావుపాల్గొన్నారు.

బైక్ ర్యాలీ 6వ తేదీకి మార్పు

ఉక్కునగరం: ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన కలెక్టరేట్ బైక్ ర్యాలీ ఈ నెల 6వ తేదీకి మార్పు చేశారు. 4న ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ వస్తున్న నేపథ్యంలో పోలీసులు ర్యాలీకు అనుమతి నిరాకరించారు. దీంతో 4న విభాగాధిపతుల కార్యాలయాల వద్ద నిరసన , 5న నిర్వాసిత కాలనీల్లో ప్రచారం, 6న కలెక్టరేట్‌కు ర్యాలీ, 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 8 గంటల వరకు నిరాహార దీక్షచేయాలని నిర్ణయించినట్టు నాయకులు తెలిపారు.

విశాఖ ఉక్కును కాపాడాలని వినతి



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వ్యాసశర్మ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ విపత్కర పరిస్థితుల్లో కూడా సామర్థ్యానికి మించి ఉత్పత్తి సాగించిందని, అలాంటి విశాఖ ఉక్కును పరిరక్షించడానికి తమవంతు సహకారం అందివ్వాలని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏఐబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ధర్మాల వ్యాసశర్మ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. పూర్వ వైభవాన్ని మర్చిపోయి కార్మికులకు మూడు మాసాలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఐదు మాసాల నుంచి జీతాలు చెల్లించకుండా మానసికంగా వేధిస్తున్నారని వివరించారు. వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీసం నాగేశ్వరరావు ఉన్నారు.

జీతాలు చెల్లించాలని ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న తాడన్న

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులందరికీ వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తాడన్న, ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించాలనే డిమాండ్‌తో శుక్రవారం స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశంపై ఇప్పటికే విశాఖ కలెక్టర్, పోలీసు కమిషనర్, రీజనల్ లేబర్ కమిషనర్లకు ఫిర్యాదు చేశామన్నారు. వివిధ సంఘాల నాయకులు వై.టి. దాస్, పుల్లారావు, మోహన్‌బాబు, కె.వి. రత్నం, బి. అప్పారావు, బి. డేవిడ్, కృష్ణనాయక్, జల్లి శ్రీధర్, బిసాయ్ ప్రసంగించిన కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సత్యానందం సేవలు ఎనలేనివి



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: నడుపూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా, సామాజిక సేవకుడిగా గుర్తింపు పొందిన బెల్లాల సత్యానందం అకాల మరణం బాధాకరమని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. బెల్లాల సత్యానందం జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన సతీమణి సరోజినీ, కుమారుడు పెంటబాబు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నడుపూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, సీడ్ బాల్స్ పంపిణీ చేశారు. వేద నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పంకజ్, కీర్తి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం రమణమ్మ, రామానుజస్వామి, కులుకూరి మంగరాజు, బొడ్డు కృష్ణారావు, బెల్లాల వెంకటరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7న విజయవాడలో 'విద్యుత్ బస్సుల'పై సదస్సు



మాట్లాడుతున్న సీతాలక్ష్మి

డాబాగార్డెన్స్: విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసీకే అప్పగించాలని కోరుతూ ఈ నెల 7న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏపీపీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విశాఖ రీజినల్ కమిటీ కార్యదర్శి సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని నందూరి ప్రసాదరావు భవన్‌లో శుక్రవారం ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కేఆర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. 2029 నాటికి ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బస్సుల స్థానంలో పూర్తిగా ప్రైవేట్ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడానికి జీవో 88 ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. పీఎంఈ బస్సు స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టనున్నారని, దీని ఫలితంగా కార్పొరేట్లకు లాభాలు, ప్రజలకు భారాలు మిగులుతాయన్నారు. 46 వేల మంది శాశ్వత ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వాతావరణ కాలుష్యానికి ఆర్టీసీ బస్సుల వాటా కేవలం 0.02 శాతం మాత్రమేనన్నారు. 0.08 శాతం అత్యల్ప ప్రమాద రేటుతో సాకర్యవంతమైన ప్రయాణం, తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందించాలంటే 3 వేల బస్సులు అవసరమవుతాయన్నారు. ప్రజా రవాణాను ప్రోత్సహించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. కొత్తగా ప్రవేశపెట్టే 750 విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా.. నేరుగా ఆర్టీసీకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ చర్చించేందుకు ఈ నెల 7న విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో జరిగే సదస్సులో సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి



జన విజ్ఞాన వేదిక సభ్యుల చేతుల మీదుగా సత్కారం అందుకున్న మహిళా ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే సేవలు మరువలేమని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్వీకే పరశురాం అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక పెదగంట్యాడ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మంచి విద్యావేత్త, సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు ఎం. సింహాచలం, ఢిల్లీరావు, వరప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు నరసింహ, నారాయణరావు, కె. మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఎనలేని కృషి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు కోమటి రమాదేవి

అగనంపూడి: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు కోమటి రమాదేవి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా 87వ వార్డు పాత వడ్లపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల్లో పేదరికం, అజ్ఞానాన్ని పారదోలడానికి అనేక విద్యా సంస్థలు నెలకొల్పారన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, సుబ్బన్న, గాలి రమణమ్మ, మజ్జి పుష్పకుమారి, ఈర్లె శ్రీరాములు, గాలి సాధూరావు పట్నాల అప్పారావు, గాలి నూకరత్నం పాల్గొన్నారు.



అగనంపూడిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో..

- పాత అగనంపూడిలోని మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో సంఘ అధ్యక్షుడు చిత్తా రామారావు, కె. ఈశ్వరరావు, ఎన్.అప్పారావు, మోహనరావు, వినోద్, ప్రవీణ్ తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

గొప్ప సంఘ సంస్కర్త

అక్కిరెడ్డిపాలెం: సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్.ఎస్. ఆంజనేయ అన్నారు. సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహిళ అని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

- అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం ఆమె జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.



మింది జెడ్పీ హైస్కూల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

కమిషనర్ దృష్టికి సమస్యలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు సెక్టార్–1,2 పరిధిలోని సూదికొండ కొండవాలు ప్రాంతాల్లో జీవీఎంసీ పైప్‌లైన్ అమర్చి మంచినీటి సరఫరా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను 85వ వార్డు నాయకుడు ప్రసాద్ కోరారు. సూదికొండ చుట్టూ ఉన్న బొర్రమాంబ ఉప్పరకాలనీ, ఇందిరానగర్, సాయినగర్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని, ఫార్మాసిటీ కాలనీల్లో శ్మశానవాటిక నిర్మాణానికి నిధులు కేటాయించాలని, అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ వరకు రహదారిలో విద్యుద్దీకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, అప్పారావు, రమేష్ పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



రాథోడ్‌ను సత్కరిస్తున్న బంజారా అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని అఖిల భారత షెడ్యూల్ ట్రైబ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాథోడ్ వస్రామ్ అన్నారు. ఇటీవల జరిగిన అఖిల భారత షెడ్యూల్డ్ ట్రైబ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికల్లో స్టీల్ ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ వస్రామ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బంజారా ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కళాక్షేత్రంలో రాథోడ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రైబల్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ నుంచి ఆ కార్యవర్గంలో తనకు అవకాశం వచ్చిందని, ప్రతీ ఒక్కరూ తమ సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బి.ఎం.కె. నాయక్, బి. వెంకటేశ్వర్లు, ఎం.ఎల్. నాయక్, శివరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతకు సత్కారం



మాస్టర్స్ అథ్లెటిక్స్ విజేత నర్సింగరావును సత్కరిస్తున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పలు పతకాలు సాధించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు సత్తి నర్సింగరావును శుక్రవారం స్టీల్ ప్లాంట్‌లో సత్కరించారు. గత నెల 28, 29 తేదీల్లో గుంటూరులో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న నర్సింగరావు 5 కి.మీ నడక పోటీల్లో బంగారు పతకం, 800 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకం, 5 కి.మీ పరుగు పోటీల్లో రజత పతకం గెలుపొందారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ వరకు కేరళ రాష్ట్రంలోని తిరుచూర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ పాయింట్ వద్ద నర్సింగరావును వివిధ కార్మిక సంఘాల నాయకులు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, యు. రామస్వామి, వై.టి. దాస్, దొమ్మేటి అప్పారావు, ముత్యాలు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com